ప్రజాశక్తి
శనివారం 17 డిసెంబర్ 2022
5
శ్రీ సత్యసాయి

మామిడి సాగుపై తోటబడి కరదీపికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు



లోపమెక్కడ..?

దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతమైన ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయం తీవ్రమైన సంక్షోభంలో ఉంది. నిత్యం కరువులకు నిలయమైన ఈ ప్రాంతం నుంచి ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వలసలు అధికంగా ఉన్నాయి. ఇటువంటి ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధి జరగాలన్న ఆకాంక్ష బలంగా ఉన్నా, ఆచరణలో మాత్రం ఇది కన్పించడం లేదు. ఉమ్మడి జిల్లాల పరిధిలో వెయ్యి మందికిపై ఉపాధి కల్పించే పరిశ్రమ ఒక్కటీ లేదన్నది నిష్టూర సత్యం. స్థానికంగా ఏర్పాటు చేయాలనుకున్న పరిశ్రమలు సైతం పక్క జిల్లాలకు తరలిపోతుండడం గమనార్హం. ఇవి ఎందుకు పక్క జిల్లాలకు తరలి వెళు_న్నాయి.? లోపం ఎక్కడుందన్న విషయాన్ని తెలపాల్సిన పాలకులు, అధికారులు దీనిపై నోరు మెదపకున్నారు.

- ◆ చేజారుతున్న పరిశ్రమలు
- ◆ వచ్చినట్టే వచ్చి పక్కకు వెళ్తున్న వైనం
- ◆ ప్రజాప్రతినిధులు, అధికారుల మౌనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి జిల్లా పరిధిలో దశాబ్దాల తరువాత 2014లో పెనుకొండ వద్ద ఏర్పాటైన కియా కార్ల తయారీ పరిశ్రమే అతి పెద్దది. అది వచ్చాక అనేక అనుబంధ సంస్థలూ వచ్చాయి. సుమారు 20 వేల మందికి ఉపాధి ఈ పరిశ్రమ ద్వారా కలుగుతోంది. ఇది చూసి మరిన్ని పరిశ్రమలు ఇటువైపు వస్తాయన్న నమ్మకమూ అందరిలో కలిగింది. అందుకు తగ్గట్టుగానే కొన్ని భారీ పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు వచ్చాయి. సత్యసాయి జిల్లా సరిహద్దులోని కొడికొండ నుంచి ఇటు అనంతపురం వరకు జాతీయ రహదారి వెంట పారిశ్రామిక ప్రగతి పరుగులు తీస్తుందన్న నమ్మకమూ జిల్లా వాసుల్లో కలిగింది. 2019 నుంచి చూస్తే పారిశ్రామికాభివృద్ధి దాఖలాలు ఒక్కటీ కనిపించకుండా పోయాయి. అంతకు ముందే వస్తాయని భావించిన పరిశ్రమలూ ఇక్కడ ఏర్పాటవకుండానే పక్క జిల్లాకు తరలి వెళ్లడం అందరినీ నిరాశకు గురిచేస్తోంది.

వచ్చినట్టే వచ్చి పక్కకెళ్లిన పరిశ్రమలు

2019కి ముందే కొన్ని పరిశ్రమలు జిల్లాకు రావడానికి సుముఖత వ్యక్తం చేశాయి. అందులో కనగానపల్లి మండలం దాదులూరు వద్ద జెఎస్‌డబ్ల్యూ స్టీల్ పరిశ్రమ ఏర్పాటు నిమిత్తం ఆ ప్రాంతాన్ని పరిశీలించింది. ఇందుకోసం 600 ఎకరాల భూమిని కూడా ఎపిఐఐసి పరిశ్రమ చూసి పెట్టింది. ప్రాథమిక దశలో ఆ పరిశ్రమ ఏర్పాటుకు కసరత్తు సాగింది. అయితే మధ్యలో ఏమైందో తెలియదుగానీ, ఇప్పుడు ఆ పరిశ్రమ కడప జిల్లాకు తరలి వెళ్లింది. ఇది ఏర్పాటయితే అటు కియా, ఇటు జెఎస్‌డబ్ల్యూ ఉక్కు పరిశ్రమ రావడంతో పెద్దఎత్తున పారిశ్రామికాభివృద్ధి సాగుతుందని ప్రజలు భావించారు. చివరి నిమిషంలో అది మారిపోయింది. ఇక జాకీ పరిశ్రమ ఏర్పాటుకు పనులు ప్రారంభించి చివరి నిమిషంలో అది కూడా పక్కకు వెళ్లింది. ఈ ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేయలేమంటూ జాకీ యాజమాన్యం ఎపిఐఐసికి ఒక ఉత్తరాన్ని అందజేసి వెళ్లిపోయింది. పరిశ్రమ ఏర్పాటు చేయకుండా వారి వెళ్లిపోతున్నా, ఇక్కడే ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ స్థాయిలో ఎలాంటి ప్రయత్నాలూ జరగలేదనే చెప్పాలి. ఆ తరువాత వచ్చిన మరో రెండు భారీ టెక్స్‌టైల్స్ పరిశ్రమలు కూడా స్థల పరిశీలన జరిపి ఎంఒయు సమయంలో కడప జిల్లాకు వెళ్లాయి. జిల్లాలో ఏర్పాటు కావాల్సిన టెక్స్‌టైల్స్ పరిశ్రమలూ రాకుండా పోయాయి. చిలమత్తూరు మండలంలోనే గతంలో ఏర్పాటు చేస్తామన్న ఎయిర్‌బస్, వీరవాహన్‌తో పాటు పలు పరిశ్రమల పేర్లు వినిపించినప్పటికీ ఏర్పాటు జరిగే వరకు సందేహాలు మాత్రం వీడటం లేదు. ఈ రకంగా జిల్లాకు వస్తాయనుకున్న పెద్ద పరిశ్రమలు రాకుండానే పక్కకు తప్పుకున్నాయి.

వికేంద్రీకరణ మాటల్లోనేనా.?

గత కొద్ది రోజులు అభివృద్ధి వికేంద్రీకరణపై పెద్దఎత్తున ప్రచారం సాగుతోంది. అభివృద్ధి వికేందీక్రరణ ద్వారా జరిగే అభివృద్ధిపై మాత్రం చర్చ జరగడం లేదని జిల్లావాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా పరిశ్రమలుగాని, సాగునీటి ప్రాజెక్టులుగా వచ్చిందేమి లేదన్న విమర్శిస్తున్నారు. కనీసం వికేంద్రీకరణ ద్వారా చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళిక కూడా ప్రభుత్వం వైపు నుంచి ప్రకటించలేదని ప్రశ్నిస్తున్నారు.

పంట నష్టాన్ని గుర్తించండి

- ◆ పరిహారం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలి
- ◆ వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డ్ ఛైర్మన్, కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మాండూస్ తుపాను నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా నష్టపోయిన వ్యవసాయ, ఉద్యాన, వివిధ రకాల పంటలను గుర్తించాలని జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డ్ ఛైర్మన్ రమణారెడ్డి, కలెక్టర్ బసంత్‌కుమార్ అధికారులకు సూచించారు. పుట్టపర్తి కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం నాడు జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డ్ ఛైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ మాండూస్ తుపాను నేపథ్యంలో జిల్లాలో ఎక్కడెక్కడ పంటలు నష్టపోయాయో గుర్తించాలని, నష్టపోయిన పంటలకు పరిహారం వచ్చేలా వివరాలను త్వరితగతిన ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలన్నారు. మాండూస్ తుపాను వల్ల అధిక వర్షాలకు వరి, పత్తి, టమోటా తదితర రకాల పంటలు దెబ్బతిన్నాయని, వాటిని క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన చేసి పూర్తి వివరాలతో రైతు భరోసా కేంద్రాల్లో సోషల్ ఆడిట్ జాబితా పెట్టి అంచనాలను సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో దెబ్బతిన్న పంటల వివరాలు పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల్లో ఆర్‌బికె మిత్రలు అందుబాటులో ఉండాలన్నారు. వర్షాల వల్ల పంటలు నష్టపోయిన మొక్కజొన్న, దానిమ్మ పంటలకు కూడా ఇన్సూరెన్స్ అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ బసంత్ కుమార్ మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన సేవలను రైతులకు అందించేలా చూడాలన్నారు. అనంతరం మామిడి సాగుపై తోటబడి కరదీపికను విడుదల చేశారు. పశుసంవర్ధక శాఖ డిడి సుబ్రహ్మణ్యంకు అనంతపురం పశుసంవర్ధక శాఖ శాఖ జేడిగా పదోన్నతి లభించడంపై కలెక్టర్ ఆయనకు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి సుబ్రహ్మణ్యం, ఉద్యాన శాఖ అధికారి చంద్రశేఖర్, సిరికల్చర్ జెడి పద్మమ్మ, అగ్రికల్చర్ ట్రేడ్, మార్కెటింగ్ అధికారి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న ఎజి.రాజమోహన్

18న జస్టిస్ ఓ.చిన్నపరెడ్డి

శతజయంతి స్మారకోపన్యాసం

హాజరు కానున్న జస్టిస్ కె.చంద్రు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

జిల్లా వాసి, మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఓ.చిన్నపరెడ్డి శత జయంతి వేడుకలను ఈ నెల 18వ తేదీన ఆర్ట్స్ కళాశాల డ్రామా హాల్‌లో నిర్వహిస్తున్నట్లు విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కన్వీనర్ ఎజి.రాజమోహన్ తెలిపారు. శుక్రవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జస్టిస్ ఓ.చిన్నపరెడ్డి జిల్లాకు చెందిన వ్యక్తి అన్నారు. జడ్జిగా ఆయన చేసిన తీర్పులు, న్యాయవాదిగా ప్రజల సమస్యలపై వాదించిన కేసులు దేశవ్యాప్తంగా ఆదర్శవంతంగా నిలిచాయని తెలిపారు. అలాంటి జడ్జి జిల్లాకు చెందిన వ్యక్తి కావడం గర్వంగా ఉందన్నారు. అలాంటి గొప్ప న్యాయమూర్తి జ్ఞాపకాలను స్మరించుకోవడానికి ఓ.చిన్నపరెడ్డి శతజయంతిని విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగ విలువలు– జస్టిస్ చిన్నపరెడ్డి తీర్పులు అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ చంద్రు ముఖ్య వక్తగా హాజరవుతున్నట్లు తెలిపారు. న్యాయవాదులు, మేధావులు, కవులు, కళాకారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇందులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం కో కన్వీనర్‌లు శ్రీనివాసరావు, ఎంఎన్‌టి.రాజు పాల్గొన్నారు.

'ఎదురీత' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - కదిరి టౌన్

సీనియర్ పాత్రికేయులు ఉన్నం వెంకటేశ్వర్లు రచించిన ఎదురీత పుస్తకాన్ని శుక్రవారం స్థానిక ఆర్ అండ్ బి బంగ్లాలో వివిధ ప్రజాసంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగవైకల్యాన్ని అధిగమించి సమాజ మార్పు కోసం పనిచేసిన ఉన్నం వెంకటేశ్వర్లు రాసిన ఎదురీత పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాల్సిన అవసరం ఉందన్నారు. ఆదర్శ నేతలు, సింధూరం, అమరవీరులు పోరాట యోధులు అనే పుస్తకాలతో పాటు ఆయన అనేక కథలు రాశారన్నారు. ఆయన రచనల్లో నిశితమైన పరిశీలన, విమర్శనాత్మక దృష్టి, సూక్ష్మ వివరాల అధ్యయనం వంటి మంచి లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఆయన అనుభవాలు నేటితరం యువతీ యువకులకు తోడ్పడుతాయని భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు పిళ్లా కుమారస్వామి, తెలుగు లెక్చరర్ శ్రీనివాసులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు జగన్మోహన్, యశ్వంత్, ముస్తాక్, జిఎల్ నరసింహులు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

ఇళ్లస్థలాల ఆక్రమణను ఆపండి

ప్రజాశక్తి -పెనుకొండ

మండలంలోని బండ్లపల్లి గ్రామానికి చెందిన దాదాపు 50 దళిత కుటుంబాలకు సంబంధించిన ఇండ్ల స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని వాటిని కాపాడి, ఆక్రమణదారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వ్యకాసం, కెవిపిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బాధితులతో కలసి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రస్తుతం గత రెండు రోజుల నుండి ఇదే గ్రామానికి చెందిన కొంత మంది తమ రాజకీయ, సామాజిక పలుకుబడిని ఉపయోగించి దౌర్జన్యంగా దళితుల స్థలాల ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నారని విమర్శించారు. దీనిపై గ్రామ దళితులు ఆక్రమణదారులతో విచారించగా తహశీల్దారు తమకు మాట పూర్వక ఆదేశాలు ఇచ్చారని దబాయిస్తున్నారని అన్నారు. అధికారులు తక్షణం విచారణకు ఆదేశించి అక్రమ నిర్మాణ పనులు ఆపి దళితులకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ దళితుల ఇళ్ల స్థలాలు ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకుంటామని ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, సిపిఎం మండల కార్యదర్శి రమేష్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రంగప్ప, సోమందేపల్లి సిఐటియు నాయకులు కొండా వెంకటేశులు, బండ్లపల్లి గ్రామ దళితులు అశోక్, శివ, రామాంజినేయులు, నరసింహమూర్తి, నరసింహులు, సురేష్, రవి, గంగమ్మ, మంగమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

ఘన వ్యర్థ పదార్థాలపై అవగాహన

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

ఘన వ్యర్థ పదార్థాల అవగాహన సదస్సును శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వ్యాపారస్తులకు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులకు ప్రొజెక్టర్ ద్వారా పలు విషయాలపై అవగాహన కల్పించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రమణరెడ్డి మాట్లాడుతూ పట్టణంలోని హోటళ్లు, కళ్యాణ మండపాలు, థియేటర్లు, ఇతర పెద్ద వ్యాపార సంస్థలు వచ్చే చెత్తలను ఎవరికి వారే ఎరువుగా తయారు చేసుకోవాలని తెలిపారు. చెత్తను ఎరువుగా తయారు చేసే పలు పద్ధతులను వివరించారు. ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ చట్టం–2016ను విధిగా అందరూ అమలు చేయాలని తెలిపారు. నియమ నిబంధనలు పాటించాలని లేకపోతే జరిమానా తో పాటు కఠిన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్ బాషా, ఎఇ ప్రతాప్, ఆనంద్ , సచివాలయ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

మున్సిపల్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించాలని అందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ అనంతపురంలో ఈ నెల 20న జరిగే బహిరంగ సభకు సంబందించిన గోడ పత్రికలను సిఐటియు నాయకులు శక్రవారం విడుదల చేశారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా మున్సిపల్ యూనియన్ కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. భూగర్భ మురుగునీటి పై పనిచేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు. ఈనెల 20న అనంతపురంలో ఉమ్మడి జిల్లాల కార్మికులతో సభ నిర్వహిస్తామన్నారు. 21, 22న మున్సిపల్ కార్మికుల ప్రతినిధుల సమావేశం ఉంటుందని ఆ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణ, చేపట్టబోయే ఉద్యమాలపై గురించి చర్చిస్తామని చెప్పారు. ఈ బహిరంగ సభలో రాష్ట్ర నాయకులు పాల్గొంటారన్నారు. జిల్లాలోని కార్మికులందరూ పెద్ద ఎత్తున బహిరంగ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి గౌస్ లాజాం, యూనియన్ నాయకులు పెద్దన్న, నాగార్జున, సాయినాథ్, నాయకులు రమేష్, రమణ, గణేష్, రామదాసు, రామంజి, కేశవ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

కార్మికుడికి ఆర్థికసాయం

తలుపుల : మండల కేంద్రంలోని గుడ్డి బాయ్ బజారుకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు షరీఫ్ ఖాన్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షులు మహబూబ్ బాషా తమ సంఘంతో చర్చించి కార్మికునికి సంఘం ఆధ్వర్యంలో రూ. 5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గణేష్, ఖాదర్ ఖాన్, బావాజన్, షౌకత్, ఖాజాముద్దీన్, అల్లావుద్దీన్, బాబా తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో మండుతున్న అటవీసంపద

రాహుల్ బేరియం పరిశ్రమలో బాయిలర్ వద్ద ఉన్న కలప

ప్రజాశక్తి-హిందూపురం

అటవీసంపద పరిశ్రమల్లో మండుతోంది. ఈ విషయంపై సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినపడుతున్నాయి. తూమకుంట పారిశ్రామిక వాడలోని రాహుల్ బేరియం రసాయనక పరిశ్రమలో బాయిలర్ల వద్ద నిల్వ ఉన్న అటవీ సంపదే అందుకు నిదర్శం. హిందూపురం రూరల్ మండలం తూమకుంట, గోళాపురం పారిశ్రామిక వాడలు ఉమ్మడి జిల్లాలోనే పెద్దవి. ఇక్కడ దాదాపు 130కు పైగా వివిధ పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో ఎక్కువ మందికి ఉపాధిని కల్పించే పరిశ్రమలతో పాటు తక్కువ మందికి ఉపాధి నిస్తూ ఎక్కువ కాలుష్యం చేసే పరిశ్రమలు ఉన్నాయి. ముఖ్యంగా ఈ ప్రాంతంలో స్టీల్, రసాయనక పరిశ్రమల వల్ల భూమి, వాతవరణం కాలుష్యం అవుతోంది. దీంతో పాటు ఈ మధ్య కాలంలో వెలసిన గార్మెంట్స్ పరిశ్రమల వల్ల భూమి కాలుష్యం అవుతోంది.కాలుష్య చట్టాలతో పాటు వాల్టా చట్టానికి తూట్లు పొడిచి అటవి సంపదను తెగ నరికి పరిశ్రమల్లో వినియోగిస్తున్నారు. అయినప్పటికి అటు రెవిన్యూ, ఇటు అటవీ శాఖ అధికారులు అటు పక్క కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. ఈ పరిశ్రమలు చిమ్మే విషవాయువును నుంచి కాస్తా ఉపసమనం లభించాలంటే విరివిగా చెట్లను పెంచాల్సి ఉంది. దీని కోసం ప్రభుత్వం వివిధ పథకాల పేరుతో చెట్లను పెంచుతోంది. ఆ చెట్లను కొంత మంది స్వార్ధ పరులు నరకి, పరిశ్రమల వారికి అమ్ముతున్నారు. వాస్తవానికి పరిశ్రమల్లో అటవీసంపదను వినియోగించడానికి లేదు. బాయిలర్ ఉంటే దానికి గనుల నుంచి లభించే బొగ్గును, గ్యాస్‌ను వాడాల్సుంటుంది. అయితే వాటిని వినియోగిస్తే అధిక ఆర్ధిక భారం అవుతుందని అటవీ సంపదను వినియోగిస్తున్నారు. దీనిపై రెవిన్యూ, అటవి శాఖ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి, అటవీ సంపదను వినియోగించే పరిశ్రమలపైన కఠిన చర్యలు తీసుకోవాలని పారిశ్రామిక వాడ చుట్టుపక్కల ఉన్న రైతులు కోరుతున్నారు.

పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పంటపొలాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి రొద్దం

వర్షాలకు పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే పార్ధసారధి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మండలంలోని పలు గ్రామాలలో వర్షాలకు నష్టపోయినా పంటలను పరిశీలించారు. ఆర్. మరవపల్లి చెందిన గుడిసె రామాంజి తను ఎనిమిది ఎకరాలలో వేసిన కంది పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతు తనకు జరిగిన నష్టాన్ని వివరించారు. ఎకరాకు పదివేల రూపాయల చొప్పున పెట్టుబడికి ఖర్చు చేశానని అయితే వర్షాల కారణంతో పూత దశలోనే పూత రాలిపోయిందని,ఉన్న కొద్దిపాటి కాయలు కూడా ఈ వారం రోజుల్లో కురిసిన వర్షాలకు పూర్తిగా దెబ్బతినిందని వాపోయారు. తనకు పెట్టుబడి కూడా తిరిగి రాని పరిస్థితి నెలకొందని వాపోయారు. అదేవిధంగా రొద్దకంపల్లి గ్రామానికి చెందిన నరసింహప్ప అనే రైతు మాట్లాడుతూ తన 2ఎకరాల పొలంలో ప్రభుత్వం అందించిన కంది విత్తనాలు కొనుగోలు చేసి పంటసాగు చేశానని అయితేపక్క పొలంవారు వారు ప్రయివేట్ వ్యక్తులతో కొనుగోలు చేసిన విత్తనాలు సాగు చేశారన్నారు. ప్రభుత్వం అందించిన నకిలీ, నాశిరకమైన విత్తనాలతో పంటను పూర్తిగా నష్టపోయాయని బాధితుడు వాపోయాడు. ఈ సందర్భంగా పార్ధసారధి మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని విమర్శించారు. అధికారులు, నాయకులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు న్యాయం చేయాలని లేకపోతే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా మండలంలోని ఎల్ జి బి నగర్ వద్ద రైతు సాగు చేసిన మొక్కజొన్న పంటను రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిత పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి సత్యసాయి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, పెనుగొండ నియోజకవర్గం అధ్యక్షులు చిన్నప్పయ్య, రాష్ట్ర అధికార ప్రతినిధి నరసింహులు, మండల కన్వీనర్ నరహరి, హరీష్, ఎం.కొత్తపల్లి సర్పంచి నాగరాజు, వీరాంజి, మురళి, రద్దకంపల్లి నాగరాజు, వేణుగోపాల్, క్రిష్టప్ప, ప్రభాకర్, క్రిష్ట, రాము,అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

రేగాటిపల్లి సొసైటీ భూముల్లో

పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

హైకోర్టు ఉత్తర్వుల పత్రాలను అందజేస్తున్న న్యాయవాది, జనసేననాయకులు

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

రేగాటిపల్లి సొసైటీ భూములలో పేదలకు ఇళ్లస్థలాలను ఇవ్వాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను జనసేన నాయకులు, న్యాయవాది స్థానిక ఆర్డీవో తిప్పేనాయక్‌కు శుక్రవారం అందజేశారు. ఈసందర్భంగతా జనసేన నాయకులు మాట్లాడుతూ రేగాటిపల్లి సొసైటీ భూములలో రైతులకు అసైన్‌మెంట్ పట్టాలు, పరిశ్రమలకు ఇవ్వకూడదని కేవలం పేదలకు ఇళ్ల పట్టాలుఇవ్వాలని సెప్టెంబరు 26న ఆర్డీవోకు వినతిపత్రం అందజేశామన్నారు. అయినప్పటికీ ఇందులో అసైన్‌మెంట్ పట్టాలు ఇస్తున్నట్టు తెలిసి నవంబరు 11న హైకోర్టును ఆశ్రయించామన్నారు. దీంతో ఈభూముల్లో పేదలకు మాత్రమే ఇళ్లస్థలాలను ఇవ్వాలని హైకోర్టు ఉత్తర్వులను ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో పోస్టు ద్వారా వచ్చిన హైకోర్టు కాపీని ఆర్డీవోకు అం దజేశామన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది సుబ్బారావు, జనసేన నాయకులు రాజారెడ్డి, పేరూరు శ్రీనివాసులు, కోటికి రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయండి

చెన్నేకొత్తపల్లి : రాప్తాడు నియోజకవర్గంలోని రైతుల సమస్యలను తెలుసుకోవటానికి శనివారం నుంచి మాజీ మంత్రి పరిటాల సునీత చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని టిడిపి నాయకులు కోరారు. 17న చెన్నేకొత్తపల్లి మండలం, ముష్టికోవెల గ్రామం నుంచి పాదయాత్ర ప్రారంభిస్తున్నారని చెప్పారు. ఈ పాద యాత్రకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేరాలు ఘోరాలు

కలకత్తా వాసి ఆత్మహత్య

ఆత్మహత్యచేసుకున్న కలకత్తా వాసి

ధర్మవరం టౌన్ : అనారోగ్యంతో బాధపడుతున్న కలకత్తా వాసి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం పట్టణంలోని రాజేంద్రనగర్‌లో చోటుచేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలు...కలకత్తాకు చెందిన ఎస్కే రాజు(30) ధర్మవరానికి వలస వచ్చి స్థిరపడ్డాడు. పట్టణంలోని రాజేంద్రనగర్లో నివాసముంటూ పట్టుచీరలపై డిజైన్లు వేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుండేవాడు. అయితే రాజుకు వెన్నెముకనొప్పి తీవ్ర కావడంతో పలు ఆస్పత్రిలలో చికిత్సలు చేయించుకున్నాడు. అయినా నొప్పి తగ్గకపోవడంతో తరచూ బాదపడుతూ ఉండేవాడు. ఈ క్రమంలో భార్యహసీనాబేగం పనినిమిత్తం నంద్యాలకు గురువారం వెళ్లింది. ఇంటిలో ఇద్దరు చిన్నారులతో ఉన్న రాజు రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంతసేపటికి తలుపులు తెరవకపోవడంతో పక్కింటివారు వెళ్లి లేపగా చిన్నారులు తలుపులు తీశారు. స్థానికులు లోపలికివెళ్లి చూడగా రాజు ఉరికివేలాడుతూ కనిపించాడు. వెంటనే టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలాన్ని పరిశీలించి మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయాన్ని మృతుని భార్యకు పోలీసులు సమాచారం అందించారు. మృతుని భార్య హసీనా బేగం పిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతునికి భార్యతోపాటు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

కర్నాటక మద్యం స్వాధీనం

చిలమత్తూరు : 44 వ జాతీయ రహదారి కర్నాటక సరిహద్దు ప్రాంతం కొడికొండ చెక్‌పోస్టు వద్ద సెబ్ పోలీసులు శుక్రవారం అధిక మొత్తంలో కర్నాటక అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతపురానికి చెందిన వ్యక్తి షిఫ్ట్ వాహనంలో 1195 హైవర్డ్స్ విస్కీ టెట్రా ప్యాకెట్లను తరలిస్తుండగాకొడికొండ చెక్‌పోస్టు వద్ద స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఎస్ఐ ఓం సింహ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీడుపల్లి ఉన్నత పాఠశాలలో మీనాక్షమ్మ వర్ధంతి

పుట్టపర్తి రూరల్ : శ్రీ సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ రత్నాకర్ మాతృమూర్తి మీనాక్షమ్మ నాలుగో వర్ధంతిని స్థానిక బీడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న 250 మంది బాల బాలికలకు రత్నాకర్ చేతుల మీదుగా స్కూల్ బ్యాగులు, విద్యాసామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా బీడుపల్లి ఉన్నత పాఠశాల సిబ్బంది రత్నాకర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రహమతుల్లా, రమణ, రాజేశ్వరి , ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మృతునికి నివాళి

కనగాన పల్లి : మండల పరిధిలో కెఎన్ పాళ్యం పంచాయతీ శివపురం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు గోవిందరెడ్డి గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పరిటాల సునీత గోవిందరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఆయన పార్టీకి చేసిన సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. ఈకార్యక్రమంలో నాయకులు యాతం పోతలయ్య, నెట్టెం వెంకటేష్, సుధాకర్ చౌదరి, భానుగోట నరసింహులు,రామగిరి మండల కన్వీనర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ తనిఖీ

గాండ్లపెంట : మండల కేంద్రంలోని బిసి హాస్టల్‌ను ఎంపీపీ జగన్మోహన్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్ సుబ్బరాయుడుకి సూచించారు. పదోతరగతి విద్యార్థుల విద్యాభ్యాసంపై అడిగి తెలుసుకున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ సభ్యులు ఫయాజ్ అలీ, నాయకులు జి రవీంద్రారెడ్డి, హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కదిరి నుంచి ప్రత్యేక బస్సులు

కదిరి టౌన్: ధనుర్మాసం పురస్కరించుకొని పలు క్షేత్రాలకు కదిరి నుండి ప్రత్యేకబస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ మైనుద్దీన్ తెలిపారు డిశెంబరు నెలలో ధనుర్మాసం సందర్భంగా భక్తాదుల సౌకర్యార్ధము తమిళనాడు, కర్నాటక లోని శ్రీరంగం, శ్రీ రంగ పట్నం, పాండు రంగ దర్శనం, మైసూర్ చాముండేశ్వరి దేవాలయం, మైసూరు ప్యాలస్ ఒకే రోజులో దర్శించుటకు వీలుగా ప్రత్యేక బస్సులను కదిరి నుంచి నడుపుతున్నామని చెప్పారు. ఈనెల 17,24,31, జనవరి 7,14 తేదీలలో శ్రీ రంగం, శ్రీ రంగపట్నం మైసూరు దర్శనమునకు బస్సులు బయలుదేరుతాయన్నారు. పెద్దలకు బస్సు ఛార్జి ఎక్స్-ప్రెస్ లో రూ. 910, సూపర్ లగ్జరీలో రూ. 1185, అలాగే తమిళనాడులోని శ్రీ రంగనాథస్వామి దేవాలయ దర్శనానికి పెద్దలకు రూ.1275లు వసూలు చేయబడుతుందన్నారు. ఈ బస్సుల కు ఆన్ లైన్ రిజర్వేషన్ కూడా ఉందన్నారు. ఏ గ్రామము నుండి అయినా 50 మంది బ్యాచు గా ప్రయాణించువారికి ఆ గ్రామం నుంచి అదనపు బస్సులు నడుపుతామన్నారు.

గ్రామాభివృద్ధిపై గ్రామసభ

రొద్దం : మండలంలోని ఆర్.లోచర్ల పంచాయతీలో ఎంపిపి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో అధికారులు గ్రామసభలను శుక్రవారం ఏర్పాటు చేశారు. 2023 - 24 సంవత్సరానికి సంబంధించి ఎన్ఆర్‌జిఎస్ కింద పనులు చేయడానికి ప్రణాళికలు రూపొందించే కార్యక్రమంలో భాగంగా గ్రామసభను ఏర్పాటు చేశారు. అనంతరం స్థానిక అంగన్వాడీ కేంద్రాన్ని ఎంపిపి తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి గంగాధర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లేపాక్షి : మండలం పరిధిలోని 33 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా శిరివరం సబ్ స్టేషన్ పరిధిలోని తిరుమలదేవరపల్లి ఫీడర్ లోని కోడిపల్లి,విభూతి పల్లి,నాగేపల్లి,తిరుమలదేవరపల్లి, కొత్తపల్లి గ్రామాలకు విద్యుత్‌సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఎఇ వెంకటేశ్వర్లు తెలిపారు.ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

పకడ్బందీగా ఆధార్ అనుసంధానం

బత్తలపల్లి : ప్రభుత్వ ఆదేశాల మేరకు ఓటరు నమోదు, ఆధార్ కార్డు అనుసంధానం పకడ్బందీగా చేపట్టాలని తహశీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీవో సాయిమనోహర్ బీఎల్ఒలకు ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని బిఎల్ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరితోనూ ఫారం-6ను తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలోకి వెళ్లిచనిపోయిన వారిని వివరాలు సేకరించి ఓటరు జాబితాలో నుంచి తొలగించాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటి తహశీల్దార్ హరిప్రసాద్, బిఎల్ఒలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

బత్తలపల్లి : రాష్ట్ర ప్రజలను ఆరోగ్యవంతులుగా చూడాలన్న లక్ష్యంతో వైద్య రంగానికి సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని ఆయన ఆశయాన్ని నెరవేర్చేలా అందరూ కషి చేయాలని జెడ్పీటీసీ కోటి సుధ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ఎంపికైన ఆశా వర్కర్లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి తేజశ్రీ, దంపెట్ల, ఓబుళాపురం, బత్తలపల్లి సర్పంచులు చల్లా కరుణాకర్‌నాయుడు, బండి సరస్వతి. అక్కిం' కాశమ, సిహెచ్ఒ రాజశేఖర్, పర్యవేక్షకులు చంద్రశేఖర్‌రెడ్డి, నారమ్మ, గౌరమ్మ, వైసిపి నాయకులు బిక్రియా తదితరులు పాల్గొన్నారు.

నియామక పత్రాలను అందజేస్తున్న జెడ్పీటీసీ, తదితరులు

పాంచజన్య పాఠశాలలో క్రియేటివ్ డే

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థుల మేధోశక్తిని వెలుగులోకి తీసుకురావాలని సంకల్పించి ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత స్థాయి విద్యార్థులకు క్రియేటివ్ డే నిర్వహించినట్లు పాఠశాల అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో 3వ తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు వారి నైపుణ్యాన్ని వెలుగులోకి తీసుకు రావాలన్న ఉద్దేశ్యంతో క్రియేటివ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఇంట్లో ఉండే వ్యర్థాలతో పాటు ఇతర వస్తువులను ఉపయోగించి వివిధ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. ఈసందర్భంగా పాంచజన్య శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మేధోశక్తిని పెంపొదించుకోవాలన్నారు. దీని కోసమే తమ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులకు తగిన శిక్షణ ఇవ్వడంతో పాటు ప్రత్యేకంగా ప్రోత్సహించడంతో విద్యార్థులు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అనంతరం మంచి నమూనాలను గుర్తించి, వాటిని తయారు చేసిన విద్యార్థులకు మెడల్, సర్టిఫికెట్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్, సెక్రెటరీ నందకుమార్, ఎఒ భాస్కర్, హెచ్ఎం గాయిత్రి, ఎహెచ్ఎంలు విజయేంద్ర, శశికళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న పాంచజన్య శ్రీనివాసులు

కలెక్టరేట్‌లో హిమోగ్లోబిన్ పరీక్షలు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

జిల్లా కలెక్టరేట్ లోని సిబ్బందికి హిమోగ్లోబిన్ పరీక్షలను వైద్యసిబ్బంది నిర్వహించారు.కలెక్టరేట్ లోని 120 మందికి పరీక్షలు నిర్వహించారు. కలెక్టర్ తో పాటు డిఆర్ఒ భాగ్యరేఖ, సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య అధికారి ఎస్‌వి కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఈ పరీక్షలలో 11 మందికి తేలిక పాటి రక్తహీనత కలిగి ఉన్నట్లు తేలిందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఈ పరీక్షలు చేశామని ఈ పరీక్షల వల్ల రక్తహీనత ఉన్న వారిని గుర్తించవచ్చునని అన్నారు. రక్తహీనత ఉన్న వారికి తగిన మందులు, సలహాలు ఇస్తామన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఈ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎస్ఎస్ తిప్పేంద్ర నాయక్, గృహ నిర్మాణ శాఖ పిడి నాగరాజు, సిపిఒ విజయ్ కుమార్, డ్వామా పిడి రామాంజనేయులు, వైద్యాధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచకపాలన : టిడిపి

కదిరి, మడకశిర, ధర్మవరంలో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న టిడిపి నాయకులు

కదిరి టౌన్: రాష్ట్రంలో రాక్షస పాలనకు బుద్ధి చెబుదామని టిడిపి మండల అబ్జర్వర్ మోపురిశెట్టి చంద్రశేఖర్, పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్ అన్నారు. ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్నిపట్టణంలోని ఆరో వార్డు, రైల్వే స్టేషన్ రోడ్, కదిరి రూరల్ మండలం ఏకలచెరువుపల్లిలో శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ప్రజల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చెన్నకేశవులు, రమణ, శ్రీనివాసులు, రామచంద్ర, షాకీర్, అంజి, రామచంద్ర, నౌషాద్, పర్వీన్ భాను, ప్రకాష్, రాజేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమరా పురం : రాష్ట్రంలో అరాచకపాలన సాగుతోందని టిడిపి నాయకులు విమర్శించారు. మండల పరిధిలోని వీరాపురం గ్రామంలో ఇదేంఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని టిడిపి నాయకులు శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం చేపట్టిన ప్రజావ్యతిరేక కార్యక్రమాల పట్ల ప్రజలు విసిగి పోయారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపి ఇంటికి వెళ్లడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ నరసింహ, మండల కన్వీనర్ వీరపసముద్రం గణేష్, నాయకులు శివరుద్రప్ప, కృష్ణమూర్తి, జయరాం, నాగరాజు, మాజీ ఎంపిటిసి చంద్రప్ప, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు

గాండ్లపెంట : మండల పరిధిలోని చామాలగొంది, బండమీద పల్లి, గాజులవారిపల్లి, రెడ్డివారిపల్లి, సింగన్నవారిపల్లి తదితర గ్రామాలలో టిడిపి నాయకులు ఇదేంఖర్మ మనరాష్ట్రానికి అనే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ఇన్‌ఛార్జి నరసింహారెడ్డి, మహిళా సభ్యురాలు పర్వీన్‌భాను, నాయకులు కొండయ్య, జయరాం, కృష్ణారెడ్డి, శివపునాయుడు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర : రాష్ట్రాన్ని పాలిస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపుదామని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని ఉప్పిడి పల్లి గ్రామంలో, పట్టణంలోని 1వ వార్డులో నిర్వహించిన ఇదేంఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీతో పాటు టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మీ నారాయణ, మనోహర్, భక్తర్, రాజాతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రామగిరి : మండలంలోని శేషంపల్లిలో శుక్రవారం నిర్వహించిన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగయ్య, సుధాకర, మారుతి ప్రసాద్, శ్రీధర్ నాయుడు, పరంధాం యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : వైసీపీ పాలనలో రాష్ట్ర అభివద్ధి తిరోగమనంలో నడుస్తోందని టీడీపీ నాయకులు విమర్శించారు. పట్టణంలోని 19, 20, 32, 33 వార్డులలో ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిఇంటికి వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పణికుమార్ పరిశేసుధాకర్, గోసలశ్రీరాములు, కేతినేనిరాజ, కేశగాళ్ల శ్రీనివాసులు, తొగట అనిల్, మారుతీస్వామి, బాలనాగరాజు, చంద్రాయుడు తదితరులు పాల్గొన్నారు.

అమడగూరు : మండలంలోని కొట్టువారిపల్లి గ్రామ పంచాయతీలోనిజవకల కొట్టు వారి పల్లి, బాలప్ప గారిపల్లి, సానే వారి పల్లి, గువ్వలపల్లి తదితర గ్రామాలలో శుక్రవారం నిర్వహించే ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి అనే కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కాలేనాయక్, కృష్ణమూర్తి, రఘువీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.